www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 9 జనవరి 2025

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

దుస్తులు పంపిణీ చేస్తున్న ఛైర్మన్, తహాశీల్దార్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ కుమార్ సొంత నిధులతో సమకూర్చిన దుస్తులను సుమారు 50 మందికి కార్మికులు, మెప్మా సిబ్బందికి బుధవారం తహాశీల్దార్ ఎంవిఎస్. సుబ్బ లక్ష్మి చేతులు మీదుగా పంపిణీ చేశారు. తహాశీల్దార్ మాట్లాడుతూ కార్మికులను కుటుంబ సభ్యులుగా భావిస్తూ దుస్తులు అందించిన ఛైర్మన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి.రవివర్మ, ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ, వైస్ ఛైర్మన్ వేటుకూరి బోసురాజు కౌన్సిలర్లు బొంతు బుజ్జి బాబు, సరిపెల్ల రామకృష్ణంరాజు, నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల వ్యవస్థను పునరుద్ధరించాలి

- యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ తీర్మానం
- రాష్ట్ర నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక
- అధ్యక్షునిగా ఎం.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కెఎస్ఎస్.ప్రసాద్
- విజయవంతంగా ముగిసిన మహాసభ

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, కాకినాడ

ప్రాథమిక పాఠశాల వ్యవస్థ(1 నుంచి 5 తరగతులు)ను పునరుద్ధరించాలని యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. కాకినాడలో జరుగుతున్న స్వర్ణోత్సవ మహాసభ బుధవారంతో ముగిసింది. చివరి రోజు రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రతినిధుల సభ జరిగింది. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని యాజమాన్య పాఠశాలలను ఒకే విద్యా గొడుగు కిందకు తెచ్చేందుకు యుటిఎఫ్ కృషి చేస్తుందన్నారు. అవసరమైతే ఎల్‌కెజి, యుకెజిలను కూడా వీటిలోనే నిర్వహించాలన్నారు. ప్రాథమిక విద్యాభ్యాసం మాతృభాషలో జరగాలన్నారు. హైస్కూల్లో రెండు మీడియంలలో బోధన కొనసాగించాలన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, సాంకేతిక స్పృహ పెంపొందించాలన్నారు. అనంతరం రాష్ట్రంలో 26 జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో జిల్లాల వారీగా విశ్లేషణ జరిపి చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ కార్యక్రమాల నిర్వహణా బాధ్యతలు చేపట్టిన కాకినాడ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నగేష్, టి.చక్రవర్తి మాట్లాడుతూ ఈ మహాసభకు సహకరించిన ప్రజాసంఘాలకు, వివిధ శాఖల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.ప్రసాదరావు, చిలుకూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిల కోసం యుటిఎఫ్ కార్యాచరణ తీసుకుందని చెప్పారు.

మహాసభలో మాట్లాడుతున్న కాకినాడ డిఇఒ రమేష్

చివరి రోజు మహాసభలో కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల బకాయిల విషయాన్ని ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రభుత్వం త్వరలో వీటిని చెల్లిస్తుందన్నారు. గత ప్రభుత్వం జల జీవన్ పథకం నిధులు రూ.21 వేల కోట్లను సక్రమంగా ఖర్చుపెట్టలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు.

కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ మాట్లాడుతూ యుటిఎఫ్ నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయ సంఘమన్నారు. స్వర్ణోత్సవాలు జరుగుతున్న కాకినాడ పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విబి.తిరుపాణ్యం మాట్లాడుతూ తమ కళాశాలలో యుటిఎఫ్ సర్ణోత్సవాలు జరుపుకోవడం హర్షణీయమన్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

యుటిఎఫ్ రాష్ట్ర మహాసభ చివరి రోజు రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక జరిగింది. రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, అధ్యక్షులుగా ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కెఎస్ఎస్.ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కె.సురేష్ కుమార్, ఎఎన్.కుసుమకుమారి, కోశాధికారిగా ఆర్.మోహన్‌రావు, 15 మంది రాష్ట్ర కార్యదర్శులతో నూతన కమిటీ ఏర్పడింది. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టిఎస్ఎన్ఎల్.మల్లేశ్వరరావు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులుగా కె.సురేష్ కుమార్, ప్రచురణాల కమిటీ చైర్మన్‌గా ఎం.హనుమంతరావు, కుటుంబ సంక్షేమ పథకం అధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, అధ్యయన కమిటీ అధ్యక్షులుగా పి.బాబు రెడ్డి ఎన్నికయ్యారు.

నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడానికి నూతన కార్యవర్గం కృషి చేస్తుందని పిలుపునిచ్చారు. స్వర్ణోత్సవ మహాసభను ఘనంగా నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి కార్యకర్తలను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో సభ్యత్వం జనరల్ ఫండ్ అధికంగా వసూలు చేసిన శాఖలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సభలో పలు కొత్త పుస్తకాలను ఆవిష్కరించారు. నాలుగు రోజులుగా అనేక సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శించిన ఉపాధ్యాయ బృందాలకు బహుమతులు అందించారు.

తీర్మానాలు ఇవీ...

యుటిఎఫ్ 17వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక స్వర్ణోత్సవ మహాసభల పలు తీర్మానాలను ఆమోదించారు. ప్రధానంగా సిపిఎస్ రద్దు, 117 జిఒ రద్దు, ప్రాథమిక పాఠశాల వ్యవస్థ 1-5 తరగతులు పునరుద్ధరణ, హై స్కూల్‌లో తెలుగు, ఇంగ్లీష్ మీడియం కొనసాగించాలని, ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయులకు ప్రమోషనులు కల్పించాలని, 12వ నూతన వేతన సవరణ సంఘం నియమించాలి, ఐఆర్ వెంటనే చెల్లించాలని తీర్మానం చేశారు. అలాగే ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, యాప్స్ భారం తగ్గించాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, నూతన విద్యా విధానం రద్దు చేయాలని, కామన్ సర్వీస్ రూల్స్ సాధన, జూనియర్ లెక్చరర్స్ ప్రోమోషన్లు ఇవ్వాలని, మున్సిపల్ టీచర్ల, ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం, ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని తీర్మానాలు చేశారు. వీటిని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది

అంతిమ యాత్రలో పాల్గొన్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

రాఘవమ్మకు కన్నీటి వీడ్కోలు

తొత్తరమూడిలో అంత్యక్రియలు పూర్తి

సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు హాజరు

నివాళులర్పించిన పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి - అమలాపురం, అయినవిల్లి

సిపిఎం జెండాను కప్పుతున్న ఎంఎల్‌సి ఐవి

కుడుపూడి రాఘవమ్మకు ప్రజలు, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు కన్నీటి వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో బాధ పడుతూ ఆమె మంగళవారం స్వగ్రామమైన అయినవిల్లి మండలం తొత్తరమూడిలో తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియులు బుధవారం నిర్వహించారు. పలువురు సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు. ఐద్వా సీనియర్ నాయకులు టి.సావిత్రి, సిపిఎం నాయకులు జి.బేబిరాణి తదితరులు ఆమె పాడెను మోస్తూ అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు రాఘవమ్మ భౌతికకాయంపై సిపిఎం జెండాను ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాఘవమ్మ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఎర్ర జెండా పట్టుకుని ఏళ్ల తరబడి ప్రజా సమస్యలపై పోరాటం చేశారాన్నరు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కమ్యూనిస్టులు ప్రజా సంఘాల నాయకులతో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. భర్త మరణం తరువాత కూడా ఉద్యమాల్లోనే కొనసాగారన్నారు. ఆమెను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాడటమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. అనంతరం సిపిఎం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు కె.కృష్ణవేణి సిపిఎం కాకినాడ జిల్లా నాయకులు దువ్వా శేషాబాబ్జి, జి.బేబిరాణి, కెఎస్.శ్రీనివాస్, ఎం.రాజ్ శేఖర్ మాట్లాడుతూ కుడిపూడి రాఘవమ్మ నాటి నుంచి నేటి వరకు ప్రజా సమస్యలపై విశ్రాంతిలేని పోరాటం చేశారన్నారు. అనేక సమస్యలు ఎదుర్కొంటూ పార్టీ విలువలకి కట్టుబడి తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జి.దుర్గాప్రసాద్, టి.నాగవరలక్ష్మి, వ్యవసాయకార్మిక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి సింహాచలం, పలివెల వీరబాబు, ఎం.వెంకటరమణ, ఎం.రామకష్ణ, పి.రామకృష్ణ, సిహెచ్.పద్మ, పీతల రామచంద్రరావు, వెంకట్రావు, కాంత్రికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు చర్యలు

కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

జిల్లాలో విద్యు త్ సరఫరాలో లోవోల్టేజ్ సమస్యను అధిగమించి నాణ్యమైన విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరిగేందుకు వీలుగా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. బుధ వారం అయినవిల్లి విద్యుత్ ఉపకేంద్రం వరకు 64 టవర్లు ఏర్పాటుకు సంబంధించి భూ సేకరణకై భూ యజమానుల తో సమావేశం నిర్వహించి భూముల విలువలపై సమీక్షించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ అయినవిల్లి మండలం అయినవిల్లి గ్రామంలో నిర్మిస్తున్న 400 కెవి విద్యుత్ ఉప కేంద్రం నిర్వహణకుగాను, విద్యుత్తు లైనుకు సంబంధించి 64 విద్యుత్ టవర్లు నెలకొల్పేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. టవర్లు ఏర్పాటుకు సంబంధించి ఎన్ని సెంట్లు మేర భూమి అవసరం అవుతుందో ఆ మేరకు సెంటుకు ప్రభుత్వ నిబంధనల అనుగుణంగా గరిష్టంగా భూ విలువలు పెంచి రూ.55 వేలు చొప్పున చెల్లిస్తారన్నారు. ఒక్కొక్క టవర్ ఏర్పాటుకు సుమారుగా రూ.2 లక్షల చొప్పున ఖర్చు అవుతుందని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా భూ యజమానులు రైతులు పూర్తిగా సహకారం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో జెసి టి. నిషాంతి, కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్, ట్రాన్స్‌కో(ఆపరేషన్), సూపరింటెండెంట్ ఇంజినీర్ శివరామ కృష్ణ, డిఇ పుల్లయ్య, ఉప కార్య నిర్వహక ఇంజినీర్ మల్లికార్జునరావు సహ ఇంజినీర్లు అనిల్ రవికుమార్ రైతులు తదితరులు పాల్గొ న్నారు.

జిఒ 36 అమలు చేయాలని డిమాండ్

సమస్యలు పరిష్కరించాలని డిఆర్‌కు సహకార సంఘాల ఉద్యోగుల వినతి

అమలాపురంలో డిఆర్ కు వినతిపత్రం అందజేస్తున్న సహకారం ఉద్యోగ సంఘం నాయకులు

ప్రజాశక్తి - అమలాపురం

సహకార సంఘాల ఉద్యోగుల కోసం జిఒ నెం. 36 అమలుచేయాలని ప్రభుత్వాన్ని జిల్లా సహకార సంఘం ఉద్యోగుల అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు, కార్యదర్శి పెంకే సత్యనారాయణ డిమాండ్ చేశారు. సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా సహకార సంఘం అధికారి కార్యాలయంలో బుధవారం డిఆర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు, సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేస్తామని 2019 మార్చి 1న జిఒ 36ను విడుదల చేసిందని గత అయిదేళ్లగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నప్పటకీ ఈ జిఒ అమలుకు నోచుకోలేదన్నారు. జిఒ ఇచ్చిన ప్రభుత్వమే వచ్చిందని మా సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజాప్రతినిధులకు, అధికారులకు అనేక విజ్ఞప్తిలు చేశామన్నారు. సహకారశాఖా మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు వెంటనే మీ హెచ్ఆర్ పాలసీ, తదితర సనుస్యలు పరిష్కరిస్తామని చెప్పారని అన్నారు. అలాగే సహకార శాఖా కమిషనర్ ఎ.బాబు కంప్యూటరీకరణలో భాగంగా డిసిటి అఫ్లోర్ ఫ్రీ మైగ్రేషన్ వర్క్ పూర్తి చేయండి వెంటనే మీ హెచ్ఆర్ పాలసీ, మిగిలిన సమస్యలు కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఎపి వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలపై నేటికీ ఎవరు స్పందించలేదన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకూ దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని కూడా తీర్మానించామన్నారుఎ. న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని గ్రామీణ స్థాయిలో రైతులకు సేవలు అందించే మాకు ప్రభుత్వం, అధికారులు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం 9న పార్లర్ రన్ తో పాటు అన్ని కంప్యూటర్ వర్క్స్ నిలుపుదల, 10న డిసిసిబి ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా, 4. 20న అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా, 27న రాష్ట్ర సహకార బ్యాంకు విజయవాడ వద్ద అన్ని జిల్లాల ఉద్యోగులతో మహా ధర్నా, వచ్చే నెల 10 నుంచి (అప్పటికీ సమస్య లు పరిష్కారం కాకపోతే) నివవధిక సమ్మె చేపడతారన్నారు. కార్యక్రమంలో ఉప ప్రధాన కార్యదర్శి కుంపట్ల అయ్యప్ప నాయుడు ఉప ప్రధాన కార్యదర్శి మట్టపర్తి జయరాం కోశాధికారి బొబ్బా రామ సుబ్రహ్మణ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కందికుప్ప సొసైటీ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన

సహకార ఉద్యోగుల నిరసన

కాట్రేనికోన: సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగులు నిరసన తెలియజేసి విధులకు హాజరయ్యారు. రాష్ట్ర యూనియన్ (సిఐటియు అనుబంధం) పిలుపుమేరకు సిబ్బంది తమ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఉన్న ఏడు సొసైటీల సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు : డిఇఒ

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేటలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డిఇఒ

విద్యతో పాటు క్రీడలు అత్యంత అవసరమని, క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా తెలిపారు. అంబాజీపేట జడ్‌పి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్రీడా పోటీల్లో బుధవారం ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఇఒ సలీం బాషా మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు, విద్యార్థులపై ఉన్న ప్రత్యేక శ్రద్ధతో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ నూతనంగా కోనసీమ 'క్రీడోత్సవం ఆటలతో ఆరోగ్యం'కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. తొలిసారిగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న 22 మండలాల్లో ఈ క్రీడా పోటీలు మండల విద్యాశాఖాధికారులు పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనే విధంగా పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేస్తుండాలన్నారు. క్రీడలు జరుగుతున్న సమయంలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందని ఎంఇఒ కె.వెంకటేశ్వరరావుకు సూచించారు. క్రీడాకారులను డిఇఒ సలీం బాషా, మండల ప్రత్యేకాధికారి, జిల్లా సహకార శాఖ అధికారి ఎస్.మురళీకృష్ణ పరిచయం చేసుకున్నారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం కె.సాయిరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ఆలమూరు:** బాల బాలికల ఆరోగ్యంతో పాటు దేహ దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరమని డిఇఒ ఎస్‌కె సలీం బాషా అన్నారు. కోనసీమ క్రీడా ఉత్సవాల ఆటలలో భాగంగా మండలంలోని కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆటల పోటీలను బుధవారం ఆయన సందర్శించారు. అలాగే విద్యార్థుల ఆటల పోటీలతో ముచ్చటించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులతోపాటు మంచి ఆరోగ్యంగా ఉండాలంటే ఆటల పోటీల్లో పాల్గొనడం వలన మంచి మేధాశక్తి కలిగి ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బి.అప్పాజీ, మండల క్రీడల అధికారి సత్తిబాబు, పిఇటి గంగవేణి, ఉపాధ్యాయులు, సచివాలయ పోలీసులు, హెల్త్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మించాలని ఆందోళన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర గ్రామంలో ఒఎన్‌జిసికి వెళ్లే రహదారిని నిర్మించాలంటూ ఆ ప్రాంత నివాసులు బుధవారం ఒఎన్‌జిసి వాహనాలను అడ్డుకొని రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు నాయకులు మహిళలు విలేకరులతో మాట్లాడుతూ నాలుగు బావులతో ఒఎన్‌జిసి సంస్థ సుమారు 30 ఏళ్లగా కార్యకలాపాలునిర్వహిస్తున్నారు. అప్పటినుంచి అధ్వానంగా మారిన రోడ్డును నిర్మించకుండా కాలయాపన చేస్తున్నారని గ్రామానికి చెందిన షేక్ కరీం, మట్టా ఏడుకొండలు ,మద్దింశెట్టి సాయి కృష్ణ ,ఉండమట్ల వెంకటేశ్వరరావు, మన్ని ఉమామహేశ్వరి, మోర్త గనికమ్మ, మందపల్లి శేషగిరి, తదితరులు, ఆవేదన వ్యక్తం చేశారు. ఒఎన్‌జిసి సామగ్రితో భారీ వాహనాల తిరగడం వల్ల రహదారి ఛిద్రమైందన్నారు. పలు నివాస గృహాలు బీటలు వారాయని , కమ్యూనిటీ హాల్ సైతం పాడైందని ఆరోపించారు . భారీ వాహనాల కారణంగా డస్ట్ ఎలర్జీతో అనేక వ్యాధు లకు గురై ఆసుపత్రు లకు పాలవుతున్నారన్నారు. దీనిపై రహదారిపై వెళుతున్న ఒఎన్‌జిసి వాహ నాలను నిలుపుదల చేసి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని అన్నారు. సంస్థ ప్రతినిధులు మనోహర్ తదితరులు వచ్చి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పినప్పటికీ ఆందోళన విరమించకుండా రోడ్డుపైనే వంటావార్పు నిర్వహించి ఆందోళన కొనసాగించారు. అంగర ఎస్ఐ రవికుమార్, సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆందోళనలో కందుకూరా సత్యం, యర్రం శెట్టి నాగేశ్వరరావు, చాపల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న అంగర గ్రామస్తులు

కార్టూ'నిజం'



ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన సత్యనారాయణ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

సత్యనారాయణకు జ్ఞాపిక అందిస్తున్న పిఎంసి ఛైర్మన్ చిన్న

ఎందరో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దిన సత్యనారాయణ ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చారని పలువురు కొనియాడారు. భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన జనిపెల్ల సత్యనారాయణను బుధవారం ఆ పాఠశాలలో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఎస్ఎంసి ఛైర్మన్ గుర్లింక చిన్న అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు కె.కిరణ్ బాబు, ఎస్.సత్య కృష్ణ, హెచ్‌ఎం ఎన్.సత్యనారాయణ, రిటైర్డ్ ఆంధ్ర యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ నల్లా బాబాయ్, స్టాఫ్ సెక్రటరీ అరవ స్వామినాయుడు, పీడీ కామన మధుసూదనరావు, ఉపాధ్యాయులు రాయి వెంకటేశ్వరరావు, పి.శివ నాగరాజు, పి.అనురాధ, లక్ష్మి, పద్మనాభ రాజు, ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కూనవరంలో ఎన్‌సిడిసిడి సర్వే

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

కూనవరంలో భీమనపల్లి పిహెచ్‌సి ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌సిడిసిడి సర్వే నిర్వహించారు.18 సంవత్సరాలు పైబడిన వారికి మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, ఓరల్ , బ్రెస్ట్, సర్వికల్ క్యాన్సర్ల వంటి వ్యాధుల కొరకు ఈ సర్వే నిర్వహించారు. ప్రజలకు ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని సర్వే బృందం సూచించింది. సర్వేలో ఆరోగ్య విస్తరణాధికారి ఆర్. రామకృష్ణమూర్తి, పిహెచ్‌సి సిబ్బంది జ్యోతి, శైలజ, నరసింహం, చంటి పాప, ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ. లక్ష విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి బుధవారం రాజమహేంద్రవరానికి చెందిన కోడూరి రంగారావు, సుబ్బులక్ష్మి దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు రూ.1లక్షా116 విరాళాన్ని ఆలయ డిసి నల్లం చక్రధరరావుకు అందజేశారు . వీరికి స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన

ఈ నెల 10న శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర దర్శనం ద్వారా యాత్రికులు స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ డిసి నల్లం చక్రధరరావు అన్నారు. బుధవారం ఆయన ఏర్పాట్లు పరిశీలిం చారు. అనంతరం మాట్లాడుతూఉత్తర ద్వారం ద్వారా 50 వేలు పైబడే స్వామివారిని యాత్రికులు దర్శించుకుంటారన్నారు.

జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఊబలంక విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - రావులపాలెం

విజయవాడలో ఈ నెల 7,8 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఊబలంక ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి ఎన్ నిఖిల్ విజయ్‌కుమార్ జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు గైడ్ ఉపాధ్యాయులు బుధవారం తెలిపారు. విద్యార్థి ప్రదర్శించిన ఆటోమేటిక్ రెయిన్ డిటెక్టర్ అండ్ క్లాత్ కలక్టింగ్ మెషిన్ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికయిందన్నారు. విద్యార్థి నిఖిల్ జనవరి 21 నుంచి 25 తేదీలలో పాండిచ్చేరిలో జరిగే జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. ప్రాజెక్టు ప్రదర్శించిన విద్యార్థి ఎన్.నిఖిల్ విజయ్ కుమార్ రెడ్డి, గైడ్ టీచర్లు ఇ.నాగలక్ష్మి, సిహెచ్.విజయలక్ష్మి లను డిఇఒ డాక్టర్ షేక్ సలీం భాషా, మండల పరిషత్ అభివద్ధి అధికారి ఇ మహేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారులు ఆర్.నాగకుమార్, బి.శ్రీనివాస రాజు, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ జివి.సుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ఎన్ఎస్.శ్రీనివాస్, ఎస్ఎంసి ఛైర్మన్ ఎం.సురేశ్వర రెడ్డి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆరోగ్యశ్రీ నిర్వీర్యానికి కుట్ర

ప్రజాశక్తి - అమలాపురం

ఆరోగ్య శ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు విమర్శించారు. చిట్టిబాబు ఆధ్వర్యంలో కలెక్టర్ కి కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులు కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ సంజీవని లాంటి ఆరోగ్య శ్రీ పథకాన్ని కూటమి సర్కారు అనారోగ్య శ్రీ మార్చిందని ఎద్దేవా చేశారు. వెంటనే ఆసుపత్రి యజమాన్యాలను చర్చలకు పిలిచి పెండింగ్ బకాయిలు తక్షణం విడుదల చేయాలని ఆరోగ్యశ్రీ సేవలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమం చేస్తామ న్నారు. కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస్, అమలాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ ధ్యక్షులు వంటెద్దు బాబి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి, ఎసిసి మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, పిసిసి మెంబర్ మాచవరపు శివన్నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానా

ప్రజాశక్తి - జగ్గంపేట

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంతో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో 18 మందిని మద్యం తాగి వాహనం నడుపుతుండగా వారిని అదుపులోకి తీసుకొని కోర్టులో ప్రవేశపెట్టామని వైఆర్.కె.శ్రీనివాస్ తెలిపారు. న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున 13 మందికి జరిమానా విధించినట్లు తెలిపారు. మరో ఐదుగురికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - రావులపాలెం

మండల పరిధి కొమరాజులంక బస్టాండ్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ప్రకారం అమలాపురం నుంచి రావులపాలెం వచ్చే రహదారి చెంతన ఉన్న కొమరాజులంక బస్టాండ్‌లో సుమారు (35) సంవత్సరాల వయస్సు గల పురుషుని మృతదేహం ఉన్నట్లు స్థానిక వీఆర్‌ఓ ఫిర్యాదు చేయడంతో స్థానిక పోలీసుస్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఎస్‌హెచ్‌ఒ, ఎస్ఐకి సమాచారం అందించాలని పోలీసు తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని గ్రామాలలో బుధవారం ఎస్ఐ ఎస్. రాము తన సిబ్బందితో పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించారు. రాజవరం గ్రామ శివారున పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,210 స్వాధీనం చేసుకున్నట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

160 కోడి కత్తుల స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రానున్న సంక్రాంతిని పురస్కరించుకుని నిర్వహించిన దాడుల్లో 160 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి బి.శ్రీహరిరాజు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వాధీనం చేసుకున్న కత్తులతోపాటు, సంబంధిత వ్యక్తిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందాలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పండుగ పర్వదినాలను ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యుల మధ్య జరుపుకోవాలని ఆయన సూచించారు. కోడిపందాలు, జూదాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిఐ బి.సూరిఅప్పారావు, ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

కత్తితో హల్‌చల్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన విద్యార్థిపై గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని చెందుర్తి గ్రామానికి చెందిన ఒక విద్యార్థి గొల్లప్రోలు జడ్‌పి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన మరో బాలిక ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఆ విద్యార్థినిపై విద్యార్థి తప్పుడుగా ప్రచారం చేస్తున్నాడు. బుధవారం ఇదే అంశాన్ని కళాశాల సమీపంలో తనపై ఎందుకు తప్పుడుగా ప్రచారం చేస్తున్నావని నిలదీసింది. దీంతో ఆ విద్యార్థి ఆమెపై దాడి చేశాడు. దాడిని అడ్డుకోబోయిన వారిని చంపేస్తానని, కత్తి తీసి భయభ్రాంతులకు గురిచేశాడు. స్థానికులు అధిక సంఖ్యలో సంఘటన ప్రాంతానికి చేరుకోవడంతో ఆ విద్యార్థి అక్కడ నుంచి పారిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పారిపోయిన విద్యార్థి వదిలిన కత్తి, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

కాండ్రకోటలో బుధవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊట ను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. దీనికి సంబంధించి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాద్‌రావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యం సీజ్

ప్రజాశక్తి-గోపాలపురం

రైస్ మిల్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ రైసును సీజ్ చేసి పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. కోమటికుంటలోని మాతంగి మాత ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ రైస్ మిల్లులో 44 బస్తాల పిడిఎస్ బియ్యం, రైస్ మిల్లు ఆవరణలో ఉన్న లారీలో 580 పిడిఎస్ బియ్యం బస్తాలను గుర్తించినట్లు తెలిపారు. వీటి విలువ రూ.14,31,111గా అంచనా వేసినట్లు తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైస్ మిల్లు యజమానులు, లారీ యజమాని, లారీ డ్రైవర్‌పై గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విధుల నుంచి తొలగింపుపై ఆవేదన

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

వివిఎ విధుల నుంచి తనను అకారణంగా తొలగించారంటూ ఉప్పాడ-2 వివిఎ తిరుమలశెట్టి చిన్ని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తన ఇద్దరు చిన్నారులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. తాను గత 16 సంవత్సరాలు వెలుగు కార్యాలయంలో వివిఎగా విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. నాటి ఎపిఎం షేకీనా ప్రియదర్శిని వివిఎగా బాధ్యతలు అప్పగించారని, నాటి నుంచి నేటి వరకు ఉప్పాడ-2 వివిఎగా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అయితే అనారోగ్యంతో నేడు తన పేరు తొలగించారని, దీనికి కారణం ప్రస్తుత ఎపిఎం అని ఆమె ఆరోపించారు. తాను ఇద్దరు చిన్నారులతో ఒంటరిగా, తన కుటుంబ పోషణ ఎలా అని ఆమె ప్రశ్నించారు. దీనిపై సీఎం పవన్‌కళ్యాణ్, కలెక్టర్, డిఆర్‌డిఎ పీడీల దృష్టికి తీసుకెళ్తానన్నారు. దీనిపై ఎపిఎం తెలుపు వివరణ కోరగా గ్రామ సంఘం సభ్యుల చేసే తీర్మానాలకు అనుగుణంగానే వివిఎ నియామకాలు, తొలగింపులు ఉంటాయని, ఎపిఎం, సిసిలకు ఎటువంటి ప్రమేయం ఉండదని వివరణ ఇచ్చారు.

పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు

కలెక్టర్ మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లావ్యాప్తంగా పట్టా భూములలో ఉన్న ఇసుక తవ్వకాలకు సంబంధించి దరఖాస్తులపై ప్రాధాన్యత క్రమంలో సర్వే నిర్వహిం చి అనుమతులు మం జూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మ హేష్ కుమార్ కమిటీ సభ్యులను ఆదేశించారు. బుధ వారం స్థానిక కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ కమిటీ అధ్యక్షులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న ఇసుక రీచులలో త్రవ్వకాలను సాధ్యమైనంత ఎక్కువగా నిర్వహిస్తూ స్టాక్ యార్డులలోనూ వినియోగదారుల డిమాండ్ కు అనుగుణంగా సరఫరా చేయాలని ఆదేశించారు. సెమీ మేకనైజ్డ్ రీచుల నుండి లక్ష్యాలకు అనుగుణంగా స్టాక్ యార్డ్లకు ఇసుకను ఎక్కువగా తరలించాలని ఆదేశించారు. కొత్తగా ఏజెన్సీలు నియమించిన మూడు రీచులలో వారం రోజులలో ఇసుక త్రవ్వకా లు ప్రారంభించాలని ఆదేశించారు. ఎక్కడ అక్ర మంగా ఇసుక తరలింపునకు ఆస్కారం లేకుండా సిసి కెమెరాల నిఘా, పర్యవే క్షణ వ్యవస్థలను బలో పేతం చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణా, అక్రమ తవ్వకాలు పేరిట వివిధ ప్రసార మాధ్యమాల్లో వస్తున్న అవాస్తవాలు, ప్రతికూల వార్తలపై క్షేత్రస్థాయిలో విచారించి వాస్తవాలతో రీజాయిం డర్స్ (ఖండన వార్త) తయారుచేసి సంబం ధిత పత్రికలకు విడుదల చేయాలన్నారు. వివిధ ప్రతిపాదనలకు సం బంధించి జాయింట్ తనిఖీలు త్వరితగతిన నిర్వహించి తవ్వకాలు కొరకు మైనింగ్ ప్లాన్ పర్యావరణ అనుమతు లను జారీ చేయాలన్నా రు. భవన నిర్మాణ రంగ డిమాండ్ కు అనుగుణం గా ఇసుక సరఫరా ఉండా లని, భవన నిర్మాణ రం గానికి సమృద్ధిగా ఇసుక సరఫరా చేయాలన్నారు. జిల్లా రవాణా అధికారి ఇసుక టోకెన్ల జారీకు అనుగుణంగా సకాలంలో ఇసుక రవాణా అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఇసుక తవ్వకాలకు అనువైన రీచ్ లను కూడా గుర్తించాలని సూచించారు. ఇసుక నాణ్యత, పరిమా ణం అక్రమ రవాణా అక్రమ త్రవ్వకాలు తదితర అంశాలపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఉచిత ఇసుక నిర్వహణ పాలసీ కి అనుగుణంగా విని యోగదారులకు బుకింగ్ అంశాలపై మరింత అవ గాహన పెంపొందించాలన్నారు. ఈ కార్యక్ర మంలో జెసి టి.నిషాంతి, ఆర్‌డిఒలు శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి ఎల్.వంశీధర్ రెడ్డి, రియాల్టీ ఇన్‌స్పెక్టర్ టి.సుజాత, జిఎస్‌డబ్ల్యూఎస్ కోఆ ర్డినేటర్ సువిజయ్, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

రీ సర్వే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి అమరావతి నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రెవెన్యూ సదస్సులు, ఫ్రీ ఓల్డ్ భూముల డేటా ఎంట్రీ, ఇత్యాది అంశాల పురోగతిపై దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో అందిన ఫిర్యాదులపై గ్రామాల వారీగా నివేదికలను రూపొందించాలన్నారు. ఇప్పటికే పరిష్కరించిన కేసులపై సంబంధిత ఆర్‌డిఒ లు ఆడిట్ చేయాలని ఆదేశించారు.భూ వివాదాలకు చెక్ పెట్టే దిశగా రూపొందించిన మార్గదర్శకా లు అనుగుణంగా సమర్థవంతంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సబ్జెక్టు వారీగా ఫిర్యా దులను విశ్లేషించి పరి ష్కార దిశగా చర్యలు వేగవం తం చేయాలని ఆయన స్పష్టం చేశారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమాన్ని పున: ప్రారంభించనున్నదని, ఈ లోపుగా రెవెన్యూ సదస్సులో అందిన ఫిర్యాదులను రీ ఓపెన్ కు ఆస్కారం లేకుండా పూర్తి నాణ్యత ప్రమాణాలతో పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు కోనసీమ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల లో 30 రెవిన్యూ అంశాలకు సంబంధించి 4,212 అర్జీలు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో జెసి టి.నిషాంతి, కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్, భూ పరిపాలన ఉప తహశీల్దార్ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అంధుల పాఠశాల నిర్వాహకులకు నగదు మొత్తాన్ని అందజేస్తున్న డైరెక్టర్ ముల్లారావు

అంధుల పాఠశాలకు సిద్ధార్థ విద్యార్థుల చేయూత

ప్రజాశక్తి - ఆలమూరు

అంధుల పాఠశాల విద్యార్థులకు సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు చేయూత అందించారు. మండల కేంద్రం లోని శ్రీ సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు, రావులపాలెంలోని శ్రీ సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు కలసి విజయవాడ స్నేహ అంధుల పాఠశాలకు మానవతా సహాయంగా విరాళాలను సేకరించారు. స్కూల్ అధినేత సిద్ధార్థ సంస్థల అధినేత కె.ముల్లారావు చేతుల మీద విద్యార్థులు సేకరించిన విరాళాలు రూ.6,70,197 బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ముల్లారావు మాట్లాడుతూ ఇందులో ఆలమూరు సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు రూ.2,43,531, రావులపాలెం సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు రూ.4,26,666 విరాళాలు సేకరించారన్నారు. ఆయన విద్యార్థులన అభినందించారు. విజయవాడలో స్నేహ అంధుల పాఠశాల శాశ్వత భవన నిర్మాణాలకు ఈ విరాళాలను అందించడం గర్వకారణమన్నారు. ఈ కషికి కారణమైన విద్యార్థుల తల్లిదండ్రులను సిద్ధార్థ పాఠశాలల ప్రిన్సిపాల్స్ ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎఒ ప్రభాకర రెడ్డి, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెముడులంక నేతాజీ స్కూల్లో విజేతలను అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసరావు

టాలెంట్ టెస్ట్‌లో నేతాజీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

ఇటీవల కడియంలో ఎన్ఆర్ఐ కళాశాల్లో ఆధ్వర్యంలో నిర్వహించిన బైసిసి టాలెంట్ టెస్ట్‌లో పదవ తరగతి నందు మండలంలోని చెముడులంక నేతాజీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ తుమ్మా శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. బడుగువానిలంకకు చెందిన సింగవరపు దుర్గా లక్ష్మీ ప్రథమ స్థానం, మడికికి చెందిన దూలం భావనలు ద్వితీయ స్థానాలు సాధించారన్నారు. ఎంపిసి టాలెంట్ టెస్ట్‌లో బడుగువానిలంకకు చెందిన పదో తరగతి నేతాజీ స్కూల్ విద్యార్థి నేతల అఖిల్ ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో ఆలమూరు, కడియం మండలాల పరిధిలో 300 మంది 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను మాజీ ఎంపిటిసి సభ్యుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై కాలేజ్ ప్రిన్సిపల్ మురళీకష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా విశ్వనాథ్

ప్రజాశక్తి - రాజోలు

నల్లి విశ్వనాథ్

ఎపి యుటిఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నల్లి విశ్వనాథ్ ఎన్నికయ్యారు. సఖినేటిపల్లి మండలానికి చెందిన విశ్వనాథ్ యుటిఎఫ్ మండల కార్యదర్శిగా, అధ్యక్షునిగా, జిల్లా కార్యదర్శిగా, యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం జిల్లా కార్యదర్శిగా, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా యుటిఎఫ్ కార్యదర్శిగా అనేక సేవలు అందించారు .ఇటీవల జరిగిన యుటిఎఫ్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎన్నిక య్యారు. ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ బలోపేతంకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ బడులను బలోపెతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం యుటిఎఫ్ పని చేస్తుందన్నారు.

మత్స్యకార సంఘాల వివాదాన్ని పరిష్కరించాలి

ప్రజాశక్తి - అమలాపురం

ధవళేశ్వరం కాటన్ బ్యారే జ్ వద్ద బొబ్బర్లంక మ త్స్యకార సంఘం, ధవళేశ్వరం మత్స్య కార సంఘాల మధ్య నెలకొన్న వివాదంపై నది సంరక్షణ కోనసీమ, తూర్పుగోదావరి మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టా లని జెసి టి.నిషాంతి ఆదేశించారు. బుధవారం మత్స్య శాఖ అధికారులు నదీ సంరక్షణ అధికారులు, పోలీసు అధికారులు మత్స్యకార సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి రొయ్య పిల్లల సేకరణ సరిహద్దు వివాదానికి గల పూర్వాపరాలపై సమీక్షించారు. కార్య క్రమంలో నదీ సంరక్షణ అధికారి ఆర్.కాశీ విశ్వేశ్వర రావు, తూర్పుగోదావరి జిల్లా మత్స్య శాఖ అధికారి వి.కృష్ణారావు, కోనసీమ జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు, ఎఫ్‌డి ఒలు డేవిడ్ రాజు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తలకు బీమా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రమాదవశాత్తు గాయపడిన పలువురు జనసేన కార్యకర్తలకు చెక్కులు పంపిణి చేశారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక టిటిఆర్ కళ్యాణ మండపం లో బుధవారం గోదాశి పుండరిష్ అధ్యక్షతన చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొత్తపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాస్ చేతుల మీదుగా నగర పంచాయతికి చెందిన ఆకుల కరుణ, ఐ.పోలవరం మండలం పాత ఇంజరం గ్రామానికి చెందిన రాచకొండ పుల్లయ్య నాయుడుకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కడలి ఈశ్వరి, పట్టణ పార్టీ అధ్యక్షుడు కర్రా దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు దూడల స్వామి,మద్దింశెట్టి పురుషోత్తం, ముత్యాల జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

నియోజకవర్గ పరిధిలో ఆర్ఎల్ఆర్‌సి ఇళ్ల నిర్మాణాలను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇఇ కెవిఆర్.గుప్తా అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆర్ఎల్ఆర్‌సి పథకంలో నియోజకవర్గంలో 8,771 గృహాలు నిర్మిస్తుండగా వీటిలో 4,400 గృహాలు నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన 4,371 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. వీటిని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో గహ నిర్మాణ శాఖ ఇఇ వై.శ్రీనివాస్, డిఇ బి.సువర్ణరాజు, సామర్లకోట మండల ప్రత్యేకాధికారి రాజేంద్ర, ఎఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ మార్కెట్ విలువ పెంపుపై అవగాహన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రభుత్వం భూ మార్కెట్ విలువను పెంపు చేసే విషయం పై ప్రజలకు అవగాహన కలిగించే విధంగా సబ్ రిజిస్ట్రార్లు కృషి చేయాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి బి.శివరామ్ పేర్కొన్నారు. ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం ఐజి శివ రామ్ ఆకస్మికంగాఇ సందర్శించి రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫిబ్రవరి 1 నుంచి ఇంప్లిమెంట్ చేయనున్న మార్కెట్ విలువలపై ప్రజలకు అవగాహన పెంచి ఏమైనా అభ్యంతరాలు ఉంటే జనవరి 24 వరకు స్వీకరించి, ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు. జిల్లా జెసి అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ నిర్ణయం మేరకు ఏరియాల వారిగా పెంచిన ధరలను జనవరి 17న ప్రజల ముందుంచి, 24 వరకు అభ్యంతరాలు స్వీకరించి, ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారన్నారు. దీనికి అనుగుణంగా ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిదిలో తగు చర్యలు తీసుకోవాలని సబ్ రిజిస్ట్రార్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ ఎం.సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ 3.5 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ గ్రామపంచాయతీ పరిధిలో గల నున్న వారి వీధిలో, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంద్వారా మంజూరైన రూ 3.5 లక్షలు తో సిమెంట్ రోడ్డు నిర్మించారు. ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ మాట్లాడుతూ ప్రభుత్వం పల్లె పండుగ అనే కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో సిమెంటు రోడ్లకు నిధులు మంజూరు చేశారని, ద్రాక్షారామ గ్రామంలో స్థానిక నున్న వారి వీధిలో కర్రి నాగమణి ఇంటి వద్ద నుండి ఎస్‌టి ఏరియా వరకు మూడు మీటర్లు వెడల్పు 65 మీటర్లు పొడవు తో సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తి చేశామన్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నిధులు కేటాయించడం వలన సిమెంట్ రోడ్డు నిర్మించామన్నారు. చాలా కాలం ఇక్కడ రోడ్డు లేకపోవడంతో సిమెంట్ రోడ్ నిర్మాణం వల్ల సమస్య పరిష్కారం అయిందని సర్పంచ్ అరుణ వివరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - మండపేట

ఆటో డ్రైవర్ లు ట్రాఫిక్ నిభందనలు పాటించాలని మండపేట టౌన్ ఎస్ఐ హరి కోటి శాస్త్రి పేర్కొన్నారు. మండపేట ట్రావెలర్స్ బంగళా వద్ద బుదవారం ఆటో డ్రైవర్లతో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సీజన్ లో ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకో రాదన్నారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేయకూడదన్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయరదన్నారు. పరిమితికి మంచి ప్రయాణికులను ఎక్కించుకోవడం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు,డ్రైవర్ లు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో బుధవారం పలుచోట్ల సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలు, రంగవల్లులతో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాయిబాబు వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, నల్లి రాజు,శైలజ, పుల్లయ్యనాయుడు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** భీమనపల్లి పంచాఅతీ సింగరాయపాలెం నెం.122 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్ డి.సుశీల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాంతి పండుగకు సంబంధించి నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు దేశంశెట్టి నాగరత్నకుమారి గ్రామ పెద్దలు గుత్తుల నాగేశ్వరరావు, పెయ్యల తిరుమలరావు,దొమ్మేటి చంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **మండపేట:** మండపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. మ్యున్సపల్ కమిషనర్ రంగారావు ఆధ్వర్యంలో డీఇ శ్రీనివాస్ తదితరుల పర్యవేక్షణ లో కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ డ్వాక్రా మహిళలు, మున్సిపల్ పాఠశాలల విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించారు. మండపేట ఐఎస్‌డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు యినపకోళ్ల సత్యనారాయణ (ఐ.ఎస్.ఎన్) సహకారంతో విజేతలకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ పతివాడ రాణి, మ్యున్సపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ చుంద్రు శ్రీ వర ప్రకాష్, వివిధ వార్డుల కౌన్సిలర్ లు కార్యక్రమానికి హాజరై విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

కొనసాగిన కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

చిన్నింపేట జీడిపిక్కల కార్మికుల ఆందోళన బుధవారం నాటికి 54వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ ప్రధాన ద్వారం వద్ద జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఫ్యాక్టరీని మూసివేయడంతో 54 రోజులుగా కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఫ్యాక్టరీని మూసివేసిన నాటి నుంచి వివిధ రూపాల్లో తమ ఆవేదనను ప్రభుత్వానికీ, ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియ చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అనిశెట్టి వీలరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, బి.ఆది, ఎం.కాంతారావు, రామదుర్గ, జయలక్ష్మి, అన్నపూర్ణ, శివలక్ష్మి, పాపారత్నం, చంటి, వరలక్ష్మి తదితరులు నాయకత్వం వహించారు.

మున్సిపాల్ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి ధర్నా

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని మున్సిపల్ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని పిడిఎస్‌యు ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం ధర్నా నిర్వహించారు. మున్సిపాల్ కార్యాలయం వద్ద ధర్నా ఉద్దేశించి పిడి .ఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీ పాఠశాలల్లో అనేక సమస్యలు ఉన్నాయని, కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో 6 హై స్కూల్స్, 16 ఎలిమెంటరీ స్కూల్స్ ఉన్నాయన్నారు. ఈ పాఠశాలల్లో బడుగు, బలహీన, పేద వర్గాల విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. అనంతరం. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రామచంద్రపురం మున్సిపల్ మేనేజర్ పిఎస్ఎన్.మూర్తికి అందించారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం, చింతా రాజారెడ్డి పిడిఎస్‌యు ఎ.అంజలి, బి.సురేఖ, వి. సంహిత, పి.నాగదేవి, రక్షిత రమణి, సదా లక్ష్మీ దేవి, సి.హెచ్ సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని సాధించాలి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

విద్యార్థినిలతో మాట్లాడుతున్న రజనీ

విద్యార్థినులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహి ంచాలని మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ చైర్ పర్సన్ పుణ్యమంతుల రజిని పేర్కొన్నారు. బుధవారం అల్లవరం మండలం గోడి సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ లో ఆమె ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు విద్యార్థినిలకు బాలికల సంరక్షణ, విద్య దాని ప్రాధాన్యత పై మోటివేషన్ క్లాస్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా రజనీ మాట్లాడుతూ కేవలం చదువు ఒకటే సమాజం లో గౌరవాన్ని, ఉన్నత స్థాయిని తెచ్చిపెడుతుందని హితవు పలికారు.బాలికల సంరక్షణపై విద్యార్థినిలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. మాజంలో ప్రతి ఆడపిల్ల చాలా జాగ్రత్తగా ఉండాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మాట వింటూ చక్కగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ యస్.కిరణ్మయి, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వరమ్మ, ఉపాధ్యాయినులు, ఎస్ఎంసి సభ్యులు జంగా శ్రీను, ఫౌండేషన్ సభ్యులు విప్పర్తి లక్ష్మీ సరస్వతి, గుర్రాల సుజాత, గోడ భాగ్యలక్ష్మి, గోడ రమాదేవి, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం తీరుపై గౌడ సామాజిక వర్గం అసహనం

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండలంలో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గాని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గాని ఎన్నడూ టిడిపి పదవులు గౌడ సామజికవర్గం నాయకులకు ఇచ్చిన దాఖలాలు లేవని మండల గౌడ సామజికవర్గం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం పెనుమల్లె గ్రామంలో గౌడ్ సామాజిక వర్గీయులు సమవేశమై కూటమి ప్రభుత్వతీరుపై అసహనం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో కొన్నివిభాగల్లో నామినేటడ్ పదవులు భర్తీ చేసే క్రమంలో నియోజకవర్గంలో గాని, మండలాల్లో గాని గౌడ సామజిక వర్గ నేతలను ఎన్నుకోలేదని గౌడ సంఘం నేతలు అసహనం వ్యక్తం చేశారు. మండలంలో సొసైటీ పదవులు ఎంపికలో కనీసం గౌడ సామజిక వర్గానికి చెందిన నాయకులను అధికారపార్టీ నాయకులు పట్టించుకోకుండా మీ అవసరం మాకు లేదు అన్నట్టు అసలు పరిగణలోకి కూడా తీసుకోలేదని ఆవేదన చెందారు. టిడిపికి ఎప్పుడూ విధేయులుగా ఉన్న గౌడ సామాజిక వర్గం ఏనాడు పార్టీ ఆదేశాలను నాయకులను విమర్శించింది లేదని అన్నారు. ఇంత నిబద్ధత కల్గిన మా కులాన్ని పదవులు ఎంపిక చేసే సమయం వచ్చేసరికి పక్కన పెట్టేస్తున్నారని కుల నాయకులు కూటమి ప్రభుత్వ నాయకులు పట్ల అసహనం వ్యక్తం చేశారు. పార్టీ ఆవిర్భావం నుండి కొండేటి రామచంద్రరావు (చినబాబు)లాంటి నిబద్ధత కలిగిన సీనియర్ నాయకుడు పదవి కావాలని అడిగితే ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు కనీసం పరిగణలోకి తీసుకోకుండా పక్కనపెట్టడం పై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.. ఉప్పూడి సొసైటీ ఎన్నికలో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, టిడిపి అగ్రనాయకులు ఒకసారి పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని గౌడ సంఘం నాయకులు ఏకతీర్మానం చేశారు. ఒకవేళ చినబాబును పార్టీ నాయకులు పక్కనపెడితే త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని గౌడ సంఘం నాయకులు మాజీ సర్పంచులు కొండేటి సూరిబాబు ,కొండేటి ధనలక్ష్మి ,మట్ట రమేష్, కష్ణమోహన్ ,వంకా శ్రీనివాసరావు, వంక బలరామమూర్తి, చంద్రశేఖర్ లు తెలియజేశారు.

45 మందికి కళ్ల జోళ్ల పంపిణీ

ప్రజాశక్తి - ఆలమూరు

ఇటీవల ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బడుగువానిలంకలో నిర్వహించిన వైద్య శిబిరంలో భాగంగా కళ్లజోళ్లు అవసరమైన 45 మంది రోగులకు బుధవారం ట్రస్ట్ చైర్మన్, ఆలమూరు కోర్టు ఎజిపి బూసి విద్యాప్రసన్న ఆధ్వర్యంలో వారందరికీ ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా అమలాపురం పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి ఈదల సత్యనారాయణ మూర్తి హాజరై పంపిణీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాలూరి గోవిందరాజు, ముప్పిరి వెర్రియ్య తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - యంత్రాంగం

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

కె.గంగవరం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు, అశ్లీల నృత్యాలు, పేకాట, గుండాట, వంటి జూద క్రీడలు తదితన అసాంఘిక కార్యక్రమాలు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని కె.గంగవరం ఎస్ఐ జానీబాషా హెచ్చరించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే జాతరలకు సంబంధించి కమిటీ సభ్యులు ఆర్గనైజర్స్ పోలీసులు తీసుకొను చట్టపరమైన చర్యలకు బాధ్యులుగుదురని, జాతరల సందర్భంగా కమిటీ మెంబర్లు తప్పనిసరిగా నోటరీ చేయించు కోవాలని, జాతర కార్యక్రమాలలో సౌండ్ బాక్సులను ఏర్పాటు చేసిన తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. మండలంలో జూద క్రీడలలో పాల్గొనేవారిని 66 మందిని గుర్తించామన్నారు. ఇప్పటివరకు 30 మందిపై బైండోవర్‌చేశామన్నారు. ఇటువంటి జూద క్రీడలలో పాల్గొని యువత వారి భవిష్యత్తును నాశనం చేసుకోరాదన్నారు. గ్రామాలలో పెద్దల సహకారంతో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారని అన్నార. ఇంకనూ కొన్ని గ్రామాలలో సిసి కెమెరా ఏర్పాటు చేయవలసి ఉందన్నారు. ఈ విధంగా మండలం మొత్తం సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కాట్రేనికోన, : చెయ్యేరు, గెద్దనపల్లి, పల్లం, బలుసు తిప్ప గ్రామంలో గ్రామస్తుల ఒదరితో రాబోయే సంక్రాంతి సందర్భంగా ఎస్ఐ ఐ.అవినాష్ జూద క్రీడలపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ ప్రజలను ఉద్దేశించి ఆయర మాట్లాడుతూ ప్రజలు సంక్రాంతి పండుగను ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు ఇవ్వకుండా సంస్కృతి, సాంప్రదాయ బద్ధంగా ఆహ్లాదకరమైన వాతావణంలో జరుపు కోవాలన్నారు. కోడిపందాలు, పేకాట, గుండాట ఆడటం నిర్వహించడం పాల్గొనడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. గతంలో కోడి పందేలు ఆడిన వారిని, వాటిని నిర్వహించిన వారిని ఇప్పటి వరకూ కాట్రేనికోన పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురుపై కేసులు బైండో వర్ చేసి వారిని మేజిస్ట్రేట్ ముందు హాజరిపరచినట్లు చెప్పారు.ఇంకా మిగిలిన వారిని బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. మండలం లోని రైతులు మరే ఇతర భూ యజమానులు వారి స్థలాలలో కోడిపందేలు, గుండాట, పేకాట, అశ్లీల నృత్యాలు వంటి మరే ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించు టకు అనుమతించరాదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఆయా గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

<u>వేలం ప్రకటన</u>

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

<u>F.D.I.A.No.4/2023 in O.S.488/2022</u>

Between:

నంగిరెడ్డి నరేష్‌బాబు ...వాది

Vs

1.కొంజెర్ల బాలాజీ
2.కొంజెర్ల రమేష్
3.నరమామిడి నాగలక్ష్మి ...ప్రతివాద్లు

పై నంబరు ఫైనల్ డిక్రీ పిటిషను వాది తనఖా బాకీ డిక్రీ అయినందున దాఖలు చెయ్యగా శ్రీకోర్టు వారు తనఖా ఆస్థిని వేలం వేయుటకు గాను ది.**29-1-25**నకు వాయిదా వేసినారు. కావున వేలంలో పాల్గొనుటకు ఆసక్తి కల వారు ది.**29-1-25**న ఉదయం 10.30 గం॥లకు పైకోర్టులో హాజరయి తనఖా ఆస్థిని వేలంలో పొందవచ్చును. కావున తెలియచెయ్యడమైనది.

<u>తనఖా ఆస్థి వివరం</u>

ప.గో.జిల్లా ప్రస్తుతం తూ.గో.జిల్లా, నల్లజర్ల మండలం, అనంతపల్లి సబ్ డివిజన్ తెలికచర్ల గ్రామం, ఆర్.ఎస్.నెం.286 నందు 210 చ.గ.స్థలంలో పడమర వైపు సగం 105 చ.గ.స్థలంనకు హద్దులు :
తూ : కొంజెర్ల రమేష్ గారి స్థలంకు మరియు ఇల్లు.
ద : మడిచర్ల మాధవరావు గారి స్థలం మరియు ఇల్లు.
ప : కనక జోగయ్య గారి భూమి.
ఉ : కొంజెర్ల సాయి బాబా గారి స్థలం.
పై ఆస్థికి గల యాజుమెంటు హక్కులతో సహా.

G.K.Durga Devi
Advocate, Tadepalligudem.
Cell: 9985592776.